సాక్షి
సంగారెడ్డి
సోమవారం । 19 । మే । 2025



ఆటలాడి.. ముంజలు తిని

వేసవి సెలవుల్లో సరదాగా గడిపిన బాల్య జ్ఞాపకాలను 'సాక్షి'తో నెమరు వేసుకున్నారు ఎస్‌ఎస్‌బి డీఎస్పీ నూకల. వివరాలు 8లో ▸



కలల సాకారాలు

జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులతో సందడిగా మారాయి.

వివరాలు 8లో ▸



విత్తనాలకు ఎదురుచూపులు

హత్నూర మండల రైతులు పచ్చిరొట్ట జనుము, జీలుగు విత్తనాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: పాత కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మిస్తున్న కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్ట చేశారు. భవన నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. సుమారు రూ.2.5 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రస్తుత అవసరాలకనుగుణంగా భవనాన్ని నిర్మించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బీ డీఈ రామకృష్ణ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల్ని ఇబ్బంది పెట్టొద్దు

ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి



జొన్న కొనుగోళ్లను పరిశీలిస్తున్న సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): రైతులకు ఇబ్బంది లేకుండా జొన్నలు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి సూచించారు. కల్హేర్‌లో ఆదివారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. అధికంగా తరుగు తీసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీర్‌షెట్టి, కాంగ్రెస్ నాయకులు దేవదాస్, తుకరాం, జితేందర్‌రెడ్డి ఉన్నారు.

రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ



రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు మండలంలోని ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంఈఓ టి.మాణయ్య ఆదివారం మీడియాకు వెల్లడించారు. ప్రతీ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు 'టీజీ స్కూల్ ఎడ్యుకేషన్'యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ కేంద్రం నుంచి హాజరు నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సబ్జెక్ట్ టీచర్లు అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి టీచర్ ప్రీటెస్ట్, పోస్ట్ టెస్ట్, రోజువారీ ఫీడ్‌బ్యాక్ రాసి, డెమో పాఠాన్ని సిద్ధం చేసి ఈ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందని తెలిపారు.

బీజేపీలో యువత చేరిక

పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



బీజేపీ జెండాను ఆవిష్కరించిన గోదావరి

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో యువత చేరుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారంకు చెందిన యువకులు గోదావరి సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. అనంతరం బీజేపీ శ్రేణులతో కలిసి బీజేపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా గోదావరి మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు ఉంటుందన్నా రు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా,పటాన్‌చెరు మండల అధ్యక్షుడు కావలి వీరేశం, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

సుజలం.. సుఫలం.. సస్యశ్యామలం



మల్‌చల్మ చెరువులో పుష్కలంగా ఉన్న నీరు

ఒకప్పుడు నీటి కోసం తల్లడిల్లిన పల్లెల్లో నేడు జలకళ ఉట్టిపడుతోంది. బావులు, బోరు బావులు సమృద్ధిగా నీటి ఊటలతో దర్శనమిస్తున్నాయి. ఎండలు మండుతున్నా భూగర్భ జలాలు తరగడం లేదు. పుష్కలంగా నీరు అందుతుండటంతో పచ్చని పంటలతో జహీరాబాద్ ప్రాంతం సస్యశ్యామలమైంది.

సాక్షి పరిశీలన

మండు వేసవిలోనూ ఉట్టిపడుతున్న జలకళ

- జహీరాబాద్ ప్రాంతంలో తగ్గని భూగర్భ జలాలు
- వ్యవసాయబావులు, బోర్లలో పుష్కలంగా నీటి ఊటలు
- పంటలకు..పశు పక్ష్యాదులు, జంతువులకు సమృద్ధిగా నీరు
- సత్ఫలితాలిస్తున్న వాటర్‌షెడ్ పథకం



రంజోల్ గ్రామంలోని వ్యవసాయ బావుల్లో 10 మీటర్ల లోతులోనే ఉన్న నీరు

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లో ఇప్పటికీ 10 మీటర్ల లోతులోనే భూగర్భజలాలున్నాయి. వ్యవసాయ బావులు, బోర్లలో సమృద్ధిగా నీటి ఊటలున్నాయి. నియోజకవర్గంలో ఐదారు చెరువులు మాత్రమే ఉన్నాయి. మండు వేసవిలోనూ పలు చెక్‌డ్యాంలలో నీరు దర్శనమిస్తోంది. మండల కేంద్రమైన కోహీర్‌లో ప్రస్తుతం 15 మీటర్ల మేర నీరు ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. మల్‌చల్మ వద్ద ఇప్పటికీ పెద్దవాగులో నీరు ప్రవహిస్తోంది. గ్రామంలోని ఈరన్న ప్రాజెక్టు చెరవులో పుష్కలంగా నీరు ఉంది. పలు చెరువులలో నీరు ఉండటంతో జంతువులు, పశు పక్ష్యాదులు దప్పిక తీర్చుకుంటున్నాయి. జహీరాబాద్ సమీపంలోని నారింజ ప్రాజెక్టులోనూ నీరు నిండుకుండలా ఉంది. నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 30వేల ఎకరాల్లో ఆయా పంటలు సాగులో ఉన్నాయి.



గొటిగార్‌పల్లి బ్రిడ్జి వద్ద చెరువు నుంచి దిగువకు జాలువారుతున్న నీరు

ఏడాదిలో మూడు పంటలు

ఏడాది పొడవునా రైతులు మూడు పంటలు తీసుకుంటున్నారు. స్వల్పకాలిక పంటల కింద వర్షాకాలంలో సోయాబీన్ పంట వేసుకుంటున్నారు. పంట తీయగానే ఆలుగడ్డ పంట వేసుకుంటున్నారు. అనంతరం మొక్కజొన్న లేదా జొన్న పంటలు వేసుకుని మూడు పంటలు తీసుకుంటున్నారు. వేసవిలోనూ తగినంత నీరు ఉండటంతో మొక్కజొన్న, జొన్నతోపాటు కూరగాయలు, పుచ్చకాయ పంటలు వేస్తున్నారు. కొందరు రైతులు దీర్ఘకాలం పంటలపట్ల ఆసక్తి చూపుతున్నారు. దీంతో చెరకు, అరటి, అల్లం, పసుపు, బొప్పాయి పంటలు సాగు చేస్తున్నారు.



రంజోల్‌లో సాగులో ఉన్న బొప్పాయి పంట



అరటి పంట సాగు

25 ఏళ్ల క్రితం వాటర్‌షెడ్ పథకానికి శ్రీకారం



బడంపేట చెరువులో నీరు తాగుతున్న మేకలు

నియోజకవర్గవ్యాప్తంగా గతంలో చేపట్టిన వాటర్‌షెడ్ పనులు భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదపడ్డాయి. ప్రముఖ ఇంజనీర్ హన్మంత్‌రావు చతుర్విధ జల ప్రక్రియను ఆవిష్కరించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని గొట్టిగారిపల్లి గ్రామంలో 2001 సంవత్సరంలో వాటర్‌షెడ్ పథకానికి శ్రీకారం చుట్టారు. ఎత్తయిన ప్రదేశంలో పడిన వర్షం నీరు చిన్న చిన్న వంకలుగా, వాగులుగా ఏర్పడి పల్లపు ప్రాంతానికి ప్రవహించి ఒక పెద్ద వాగు లేదా కాలువ ద్వారా బయటకు పోయే ప్రదేశాన్ని నీటి పరీవాహక ప్రాంతం లేదా వాటర్‌షెడ్ అంటారు. చతుర్విధ జల ప్రక్రియలో నాలుగు అంశాలు ప్రధానమైనవి. 1. వాన నీటిని నిలువరించడం. 2) భూగర్భంలోకి నీటిని ఇంకించడం. 3) లోయ ఉపరితలంలో నీటిని నిల్వ చేయడం. 4) భూమిలో తేమను కాపాడటం. రిడ్జ్ టు వ్యాలీ (శిఖరం నుంచి లోయ) విధానంతో, ప్రజల భాగస్వామ్యంతో ఎలాంటి సిమెంట్, కాంక్రీట్ లేకుండా ఒక వాటర్ షెడ్ ఏరియాను సృష్టించడం. వాటర్‌షెడ్ పథకంతోపాటు వర్షాలు సైతం ఆశించిన మేర కురవడంతో నీటి ఊటలు పుష్కలంగా ఉన్నాయి.

జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు (ఎకరాల్లో)

జొన్న	11,021
మొక్కజొన్న	6,463
చెరకు	10,044
స్వీట్‌కార్న్	500
అరటి	650
అల్లం	2,800
కూరగాయలు	1,500

గ్రామమంతా లబ్ధి పొందుతున్నారు



వాటర్‌షెడ్ ఫలితాలతో గ్రామం అంతా లబ్ధిపొందుతున్నారు. 99 శాతం మందికి భూములున్నాయి. పంటలు పండించుకుని జీవనోపాధి పొందుతున్నారు. గతంలో నర్సాపూర్, తూప్రాన్, దుండిగల్ ప్రాంతాలకు వలస వెళ్లి కూలి పనులు చేసుకునే వారు. ఇప్పుడు గ్రామంలో వ్యవసాయం చేసుకుని అభివృద్ధి చెందుతున్నారు. నేను కూడా బోరు నీటితో ఆరు ఎకరాల్లో మూడు పంటలు పండించుకుంటున్నాను.

– రాచయ్య, మాజీ సర్పంచ్–గొట్టిగారిపల్లి

మూడు పంటలు పండిస్తున్న



నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఏడాది పొడవునా రెండు ఎకరాల్లో మూడు పంటలు పండించుకుంటున్నా. వర్షాకాలంలో సోయా వేస్తున్నా. పంట తీశాక ఆలుగడ్డ వేస్తున్నా. అది చేతికి వచ్చాక ఇప్పుడు మొక్కజొన్న పంట వేశాను. మిగతా రెండెకరాల్లో చెరకు పంట వేశాను. పంటలకు తగినంత నీరు బోరు నుంచి అందుతోంది.

– మైసని రాజు, రైతు–గొట్టిగారిపల్లి

26 ఎకరాల్లో పండ్ల తోటలు



తగినంత నీరు ఉన్నందున 26 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నా. 20 ఎకరాల్లో బొప్పాయి, 6 ఎకరాల్లో అరటి పంట ఉంది. 3 ఎకరాల్లో అల్లం, 5 ఎకరాల్లో చెరకు, 5 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాం. బోర్లలో తగినంత నీరున్నందునే అన్ని పంటలు బాగున్నాయి. దీంతో లబ్ధి పొందుతున్నాం.

– జి.సంజీవ్, రైతు–రంజోల్

23న జిల్లాకు సీఎం రేవంత్ రాక!

- నిమ్జ్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- జహీరాబాద్‌లో బహిరంగ సభ!



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ వారంలో జిల్లాలో పర్యటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. జహీరాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం ఈనెల 23న సాయంత్రం 4 గంటలకు జిల్లాకు వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక జిల్లాలో తొలిసారి అధికారికంగా పర్యటించనున్నారు. ఇటీవల సంగారెడ్డిలోని రాంమందిర్ వద్ద జరిగిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు వివాహ నిశ్చితార్థానికి రేవంత్‌రెడ్డి హాజరైన విషయం విదితమే. నిమ్జ్ (జాతీయ ఉత్పాదక, పెట్టుబడుల మండలి)లో నిర్మించిన రోడ్డును సీఎం ప్రారంభించనున్నారు. అలాగే జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇతర అభివృద్ధి పనులను కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని అధికారులు చెబుతున్నారు.

30 వేల మందితో సభ!

సీఎం జిల్లా పర్యటన సందర్భంగా జహీరాబాద్‌లో బహిరంగ సభను నిర్వహించాలని యోచిస్తున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మందిని తరలించాలని భావిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. సీఎం పర్యటన షెడ్యూల్ త్వరలో అధికారికంగా ఖరారయ్యే అవకాశాలున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లను ప్రారంభించేందుకు జహీరాబాద్ వెళ్లనున్నారు.

'మెపా' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యాదగిరి

వర్గల్(గజ్వేల్): ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వర్గల్ మండలం మీనాజీపేటకు చెందిన దుండిగల్ యాదగిరి నియమితులయ్యారు. మండలంలో సీఆర్‌పీగా పనిచేస్తున్న యాదగిరి ప్రస్తుతం సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశంలో తనను 'మెపా' రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియామకం చేసినట్లు యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని అన్నారు.

దేవాలయ నిర్మాణాలకు సహకరిస్తా

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- రాజగోపురం నిర్మాణానికి రూ.27 లక్షల విరాళం అందజేత



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పటాన్‌చెరు: దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని జీపీ గుట్ట కాలనీలో నూతనంగా నిర్మించిన రాధాకృష్ణ దేవాలయం రాజగోపురం నిర్మాణానికి రూ.27 లక్షల భారీ విరాళం అందించారు. స్థానిక ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి రాజగోపురాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. భవిష్యత్తులోనూ దేవాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నియోజకవర్గ వ్యాప్తంగా 200కు పైగా దేవాలయాలను సొంత నిధులతో నిర్మించడంతోపాటు పురాతన ఆలయాలను జీర్ణోధారణ చేస్తామన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేశ్, మాజీ కౌన్సిలర్ బాశెట్టి కృష్ణ, నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన ఉల్లి



చర్లగూడెం శివారులో అకాల వర్షంతో పాడైపోయిన ఉల్లి పంట

కంది(సంగారెడ్డి): ఇటీవల కురిసిన అకాల వర్షంతో చేతికి రావాల్సిన ఉల్లి పంట పూర్తిగా తడిసిపోయి పనికి రాకుండా పోయింది. కంది మండలంలోని చెర్లగూడెంకు చెందిన రైతు దత్తాత్రేయ స్వామి రెండు ఎకరాల పొలంలో ఉల్లి పంట సాగు చేశాడు. పంటను కోసి ఓ చోట చేర్చి సంచులు నింపేందుకు ఇంటికి రాగా అంతలోనే రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో సుమారు వంద క్వింటాళ్ల ఉల్లి మొత్తం తడిసిపోయింది. తడిసిన ఉల్లిని ఆరబెట్టినా కుళ్లిపోతోందని, ఈసారి పంట బాగా పండినా చేతికొచ్చే సమయానికి అందకుండా పోయిందని విలపిస్తున్నాడు. అధికారులు స్పందించి పంట నష్ట పరిహారం ఇప్పించి తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

సర్కారు బడి.. సీట్లకు పోటీపడి

- సర్కార్ బడుల్లో చేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి
- మరిన్ని సౌకర్యాలు కల్పించాలంటున్న స్థానికులు
- కరపత్రాలతో టీచర్లు జోరుగా ప్రచారం



జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు డ్రిల్ చేయిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కార్ బడులకు మరింత డిమాండ్ పెరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు సీటు కావాలంటూ పెద్ద ఎత్తున రికమండేషన్‌లు వస్తున్నాయంటే సర్కార్ పాఠశాలలకు ఉన్న డిమాండ్ ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి ఏటా సర్కార్ బడులకు పెరుగుతున్న ఆదరణ, విద్యార్థులకు అనుగుణంగా మరింత మౌలిక సదుపాయలను కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నత విద్య చదివిన వారే..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉన్నత విద్య చదువుకున్న ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. తరగతి గదిలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అర్థమయ్యే విధంగా విద్యా బోధన చేస్తున్నారు.

ఆధునిక భవనాలు..

మండల పరిధిలో రామచంద్రాపురం, బీహెచ్‌ఈఎల్, తెల్లాపూర్, కొల్లూరు, ఈదులనాగులపల్లి, వెలిమెలలో జిల్లా పరిషత్ పాఠశాలలున్నాయి. ఉస్మాన్‌నగర్‌లో కస్తూర్బా, వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ పాఠశాలలున్నాయి. గతంలో ప్రస్తుత ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పలు పాత భవనాలను కూల్చి దాతల సహకారంతో నూతన ఆధునిక భవనాలను నిర్మించారు. మౌలిక సదుపాయాలను కల్పించారు.

డిజిటల్ బోధన... పలు అంశాలపై శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ విద్యా బోధన అందిస్తున్నారు. దానితోపాటు కంప్యూటర్‌పై విద్యార్థులకు మరింత పరిజ్ఞానం పెంచాలన్న లక్ష్యంతో ప్రత్యేక బోధన చేస్తున్నారు. ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కరాటేలో శిక్షణ అందిస్తున్నారు.



విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన

ఉత్తమ ఫలితాలు..

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. అనేక పాఠశాలలు వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాయి. అందుకు జిల్లా ఉన్నతాధికారులు చొరవతీసుకుని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని ప్రోత్సహిస్తున్నారు. అందుకనుగుణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

జోరుగా ప్రచారం..

ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల్లోని విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, సాధించిన ఫలితాలను కరపత్రాలను తయారు చేసి జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. దాంతో అనేకమంది తల్లిదండ్రులు వారి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు.

పలు సమస్యలతో ఇబ్బందులు..

ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న పలు పాఠశాలల్లో సమస్యలతో ఇబ్బందులు తప్పడంలేదు. తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 450 మంది విద్యార్థులున్నారు. కేవలం 7మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. గతేడాది ఇద్దరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వచ్చారు. విద్యార్థుల సంఖ్య ప్రకారం 19మంది ఉపాధ్యాయులు ఉండాలి. బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాలలో 686మంది విద్యార్థులున్నారు. ఈ పాఠశాల ప్రాంగణంలో హాస్టల్ ఉండటం కారణంగా తరగతి గదుల కొరత ఉంది. సుమారు 7మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. కొల్లూరు పాఠశాలలో పలు సమస్యలున్నాయి. విద్యార్థులను గదుల కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో డబుల్ బెడ్ రూం నివాసులు ఇతర ప్రాంతాల నుంచి రావడంతో ఇక్కడ ఉర్దూ మీడియం పాఠశాల అవసరం ఉంది. ఈదులనాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘికశాస్త్రంకు సంబంధించిన ఉపాధ్యాయుల కొరత ఉంది.

అడ్మిషన్లు పెరుగుతున్నాయి



ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌లు పెరుగుతున్నాయి. ఇంగ్లిష్‌మీడియంలో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. మా పాఠశాలలోని సదుపాయాలు, ఫలితాలను కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నాం. పాఠశాలలో అడ్మిషన్‌ల కోసం పెద్దల నుంచి సైతం ఫోన్‌లు వస్తున్నాయి.

– టి.భాస్కర్, ప్రధానోపాధ్యాయులు, తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాల.

క్లుప్తంగా

టెక్నోజియంలో బీవీఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల బృందం

నర్సాపూర్: బెంగళూరులో జరిగిన 8వ జాతీయ స్థాయి ఎల్అండ్‌టీ టెక్నోజియం పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని స్థానిక బీవీరాజు ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ లక్ష్మిప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబె ఆదివారం పేర్కొన్నారు. పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 569 కాలేజీలకు సంబంధించిన 40వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫైనల్స్‌కు చేరిన 36జట్లలో తమ కాలేజీ ఈసీఈ బ్రాంచ్ విద్యార్థుల జట్టు ఉందన్నారు. కాగా ఈసీఈ జట్టు పోటీల్లో ప్రతిభ కనబర్చి సెకండ్ రన్నరప్‌గా నిలిచి అవార్డుతో పాటు రూ.3 లక్షల నగదు బహుమతి అందుకున్నారని తెలిపారు. బహుమతి అందుకున్న విద్యార్థులను సొసైటీ చైర్మన్ విష్ణురాజు, వైస్ చైర్మన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్యవిస్సాం అభినందించారు.

నేటి నుంచి ఏఐసీఆర్‌పీ వార్షిక సమావేశం

– ములుగు ఉద్యానవర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి



రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్): ఆల్ ఇండియా కో ఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్(ఏఐసీఆర్‌పీ) 25వ వార్షిక సమూహ సమావేశం ఈ నెల 19, 20 తేదీల్లో రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాలలో నిర్వహించనున్నట్లు ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి తెలిపారు. ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఆన్ ట్యూబర్ క్రాప్స్, రాజేంద్రనగర్‌లోని వెజిటబుల్ రీసెర్చ్ స్టేషన్, తిరువనంతపురానికి చెందిన సీటీసీఆర్ఐచే సమావేశం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో దేశంలోని 21 వేర్వేరు కేంద్రాల్లో పనిచేస్తున్న 50 మంది శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో శాస్త్రవేత్తలు గతేడాది చేసిన పనులపై చర్చించడంతో పాటు వచ్చే సంవత్సరానికి సాంకేతిక కార్యక్రమాన్ని రూపొందిస్తారని వివరించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్): పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేశారు. హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని చాల్కి గ్రామ శివారులో ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. దాడిలో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.44వేలు, మూడు ద్విచక్ర వాహనాలు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటలాడి.. ముంజలు తిని..



నూకల వేణుగోపాల్ రెడ్డి

సమ్మర్ స్పెషల్

వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఇంట్లో చేసే సందడి, రోజు కొనిచ్చే ఐస్‌క్రీం నేటికీ తీపి జ్ఞాపకాలే. ఊరిలో స్నేహితులు, సోదరులతో సరదాగా గడిపేవాణ్ణి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంట పొలాల్లో అందరం కలిసి క్రికెట్ ఆడేవాళ్లం. గ్రామంలోని బావుల్లోనే ఈత నేర్చుకున్నా. ఆకలి వేస్తే ఇంటికి వెళ్లకుండా తాటి ముంజలు తినే వాళ్లమని జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ నూకల వేణుగోపాల్ రెడ్డి బాల్యంలోని తన జ్ఞాపకాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే..

రామచంద్రాపురం(పటాన్‌చెరు):

నల్గొండ జిల్లా ముకుందాపురం గ్రామం మాది. గ్రామంలోనే పదవ తరగతి వరకు చదువుకున్నాను. బాల్యంలో వేసవి సెలవులు వచ్చాయంటే మా మామయ్య వచ్చి అమ్మమ్మ దేవతమ్మ గ్రామమైన పూసలపహాడ్‌కు తీసుకెళ్లేవారు. వేసవిలో అక్కడ స్నేహితులు, సోదరులతో గడిపేవాణ్ణి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంట పొలాల్లో ఆడుకునే వాళ్లం. అక్కడి బావిలోనే ఈత నేర్చుకున్నాను. ఆకలి వేస్తే ఇంటికి పోకుండా తాటి ముంజలు తినే వాళ్లం. ఇంటికి వెళ్లి కడుపునొప్పితో బాధపడుతుండే. రోజు అమ్మమ్మ అందరికీ ఐస్‌క్రీం కొనిచ్చేది. ఆ తీపి గుర్తులను నేటికీ గుర్తు చేసుకుంటాను.

చిన్నారులను వారికి నచ్చిన ఆటల్లో చేర్పించండి

వేసవిలో సొంత గ్రామాలకు వెళ్లని పక్షంలో చిన్నారులను వారికి నచ్చిన క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి. చిత్రలేఖనం, సంగీతం లాంటి క్లాస్‌లలో చేర్పించడం వల్ల సంస్కృతి, సంప్రదాయంపై మరింత అవగాహన పెరుగుతుంది. దీంతో పాటు క్రమశిక్షణ పెరిగి ఉన్నతస్థాయిలో స్థిరపడతారు.

వేసవి వస్తే అమ్మమ్మ ఇంట్లో సందడే

- గ్రామంలోనే ఈత నేర్చుకున్నా
- అల్లరి చేసేవాళ్లం..ఐస్ క్రీం తినేవాళ్లం
- స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేవాడ్ని
- బాల్యం జ్ఞాపకాలు తీపి గుర్తులు
- జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ నూకల వేణుగోపాల్ రెడ్డి

క్రికెట్ అంటే ఇష్టం..



డిగ్రీ చదువుకునే రోజుల్లో క్రికెట్ పోటీలకు వెళ్తూ..

హైస్కూల్‌కు వచ్చిన తరువాత మా గ్రామంలోనే ఉండేవాణ్ణి. క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం. దీంతో స్నేహితులతో కలిసి మొదట గ్రామంలో నేను క్రికెట్ ఆడటం మొదలు పెట్టాను. అప్పటి నుంచి డిగ్రీ వరకు పక్క గ్రామాల వారితో క్రికెట్ పోటీలు నిర్వహిస్తుండేవాడిని. రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించాను.

పిన్ను మింగి ఊపిరాడక చిన్నారి మృతి



అనబియా

వర్గల్(గజ్వేల్): బుడిబుడి నడకలు.. కేరింతలతో ముద్దులొలికే చిన్నారి.. ఏది తినాలో ఏది తినకూడదో తెలియని పసి ప్రాయం..ఆటలాడుకుంటూ పిన్నులాంటి వస్తువును మింగి ఊపిరి తీసుకోలేక అల్లాడిపోయింది. చివరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ చిన్నారి కన్నుమూసింది. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చిన ఈ విషాదకర ఘటన వర్గల్ మండలం నాచారంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కీర్తి రాజు వివరాల ప్రకారం.. హర్యానా రాష్ట్రానికి చెందిన షోయబ్‌ఖాన్, నజియా దంపతులకు అహ్మద్‌ఖాన్, అనబియా(14 నెలలు) అనే ఇద్దరు పిల్లలున్నారు. షోయబ్‌ఖాన్ నాలుగు నెలల నుంచి నాచారంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం అతడి చిన్న కూతురు అనబియా ఇంట్లో బొమ్మలతో ఆడుకుంటూ పిన్నులాంటి వస్తువును మింగింది. అది గొంతుకు అడ్డుపడటంతో శ్వాస తీసుకోలేక తల్లడిల్లింది. గమనించిన తల్లిదండ్రులు చికిత్సకోసం చిన్నారిని లక్ష్మక్కపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నిలోఫర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున కన్నుమూసింది. చిన్నారి మృతితో ఆ కుటుంబం దుఃఖ సాగరంలో మునిగిపోయింది. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ప్రొబేషనరీ ఎస్ఐ తెలిపారు.

పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్ మృతి

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని గుండ్ల మాచునూర్ గ్రామానికి చెందిన హత్నూర పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్ బేకరీ సాయిలు (80)ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ పొందిన అనంతరం హత్నూర పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సాయిలుకు గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో మంచి పేరు ఉంది. కొద్ది నెలలుగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆదివారం ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు.

కుటుంబ కలహాలే ప్రాణం తీశాయి..

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పెర్క ఇస్తారి(48), ఇంద్ర దంపతులకు ఇద్దరు కూతుళ్లు. కొంతకాలంగా ఇస్తారికి అతడి భార్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఈనెల 16న ఇంద్ర తన ఇద్దరు పిల్లలతో కలిసి మజీద్‌పల్లిలో ఉండే ఆడపడుచు ఇంటికి వెళ్లింది. ఆదివారం వీరి ఇంటి సమీపంలో ఉండే లక్ష్మణ్ పశువులకు నీళ్లను తాగించేందుకు వెళ్తూ తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా ఇస్తారి చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. వెంటనే ఇంద్ర కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కాగా కుటుంబ కలహాలతో తాను చనిపోతున్నానంటూ ఈనెల 17న పలువురు గ్రామస్తులతో చెప్పాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 155వ సంకీర్తన



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి వినోద్‌ప్రభు

జహీరాబాద్: నిర్దయ కలిగిన వ్యక్తుల పట్ల జాలి, కరుణ చూపించడం తగదని స్థానిక హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి డాక్టర్ వినోద్‌ప్రభు అన్నారు. ఆదివారం ఉదయం జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో 155వ నగర సంకీర్తన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... శత్రువులకు ఎదుటివారి సామర్థ్యం, సత్తా తెలిసినప్పటికీ నిర్దయగల మాటలతో దూషిస్తూనే ఉంటారన్నారు. అలాంటి వారి పట్ల అవాంఛితమైన జాలిని చూపడం వీరుడి లక్షణం కాదని, ఇదే విషయాన్ని కృష్ణ పరమాత్మ అర్జునుడికి బోధించారని వివరించారు. సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్లాలని హితవు పలికారు. అంతకు ముందు పట్టణంలోని సుభాష్‌గంజ్‌లోని పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారులు అల్లాడి వీరేశం, అల్లాడి నర్సింహులు, కల్వ శేఖర్, లక్ష్మణ్, సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, హరేకృష్ణ బృందం సభ్యులు రతన్ సారడా, వెంకటేశ్, జయప్రకాష్, విజయ్, ఎన్నం రఘు, జానకిరామ్, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపిక, కన్నయ్య వేషధారణలో పాల్గొన్నారు.



నీటిలో మునిగిన బాలికను రక్షించిన క్యూఆర్టీ టీం



తప్పి పోయిన బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న క్యూఆర్టీ పోలీసులు

శభాష్..పోలీస్

- నీట మునిగిన బాలికను..
- తప్పిపోయిన బాలుడ్ని రక్షించిన క్యూఆర్టీ టీం
- ఏడుపాయల్లో తక్షణ స్పందన టీం ఘనత

పాపన్నపేట(మెదక్)/ మెదక్ మున్సిపాలిటీ : ఏడుపాయల్లో ఆదివారం నీట మునిగిన బాలికను.. తప్పి పోయిన బాలుడ్ని క్యూఆర్టీ టీం రక్షించింది. ప్రమాదం అంచున ఉన్న భక్తులకు తక్షణ రక్షణ కల్పించేందుకు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఏర్పాటు చేసిన క్యూఆర్టీ టీం తన మొదటి సాఫల్యతను సాధించింది. మృత్యువు అంచున ఉన్న చిన్నారిని రక్షించిన పోలీసులు ఆపన్నుల పాలిట ప్రాణదాతలుగా నిలిచారు. ఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి వివరాల ప్రకారం... ఏడుపాయలకు వచ్చిన ఓ బాలిక చెక్ డ్యాం వద్ద ప్రమాదవశాత్తు నీటిలో మునిగింది. వెంటనే అక్కడే ఉన్న క్యూఆర్టీ టీం ఏఎస్ఐ శ్రీనివాస్ , కానిస్టేబుళ్లు యాదగిరి, రాజేందర్ పాపను కాపాడి, వైద్య సహాయం కోసం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ తొందరలో వారి వివరాలు తెలుసుకోలేక పోయామని ప్రొబేషనరీ ఎస్సై నరేష్ తెలిపారు. మరో ఘటనలో కామారెడ్డి జిల్లా చింతపల్లికి చెందిన నరేష్ గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. అమ్మవారిని దర్శించుకొని వస్తున్న క్రమంలో వారి కుమారుడు లలిత్‌గౌడ్ (4) తప్పి పోయి రాజగోపురం వద్ద ఏడుస్తూ కనిపించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, బాలుడి వివరాలు తెలుసుకొని, వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సంబంధిత పోలీసులను ఎస్పీ అభినందించారు.

గడ్డి మందు తాగిన యువకుడు

భవనంపైకి ఎక్కి హల్‌చల్

జోగిపేట(అందోల్): గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడు చికిత్స చేసుకోవడానికి సహకరించకుండా జోగిపేటలోని ఏరియా ఆస్పత్రి భవనం పైకి ఎక్కి దూకి ఆత్మహత్య చేసుకుంటానని హల్ చల్ చేశాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... టేక్మాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మధు కుటుంబంలో జరిగిన గొడవల కారణంగా మద్యంతో పాటు గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. గడ్డి మందు తాగిన విషయాన్ని ఆస్పత్రిలో మధు సోదరుడు, తల్లి వైద్యులకు చెప్పడంతో అతడిచేత కక్కించే ప్రయత్నం చేశారు. అనంతరం యువకుడు మెట్లపై నుంచి భవనంపైకి వెళ్లి తనను అంబులెన్స్ డ్రైవర్ తిట్టాడని, ఆయనను పిలిపించాలని లేనిచో విద్యుత్ తీగలపై దూకి చనిపోతానని బెదిరించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ పాండు, ఏఎస్ఐ అంజయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చారు. యువకుడికి నచ్చజెప్పి కిందకు దింపి చికిత్సకు ఒప్పించారు. పరిస్థితి బాగా లేకపోవడంతో సంగారెడ్డికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొట్టి ట్రాక్టర్ డ్రైవర్ మృతి



ఇంటి గోడను ఢీ కొట్టి నిలిచిపోయిన ట్రాక్టర్



మృతి చెందిన రాఘవ

నంగునూరు(సిద్దిపేట): రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి పాలమాకులలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సంపంగి రాఘవ (16) ట్రాక్టర్‌లో వడ్లను గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో అతివేగంగా వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. రోడ్డు పక్కనున్న ఓ ఇంటి గోడను ఢీకొని ట్రాక్టర్ నిలిచిపోయింది. రాఘవ రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రాజగోపాలపేట ఎస్ఐ అసీఫ్, ప్రొబిషన్ ఎస్ఐ సౌజన్య సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేసి అంబులెన్స్‌లో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ట్రాక్టర్ ఇంటి గోడను ఢీకొన్న సమయంలో చిన్నారులు, మహిళలు వరండాకు మరోపక్క ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

– దంపతులకు తీవ్ర గాయాలు

అల్లాదుర్గం(మెదక్): ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం శివారులోని 161 జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గొల్లకుంట తండాకు చెందిన సురేశ్ నాయక్, భార్య హంసీబాయ్ అల్లాదుర్గం వెళ్లి తిరిగి తండాకు బైక్‌పై వస్తున్నారు. చిల్వెర వైపు నుంచి పెద్దశంకరంపేట వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న సురేశ్, హంసీబాయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ.రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం... కర్నాటక రాష్ట్రంలోని గుల్‌బర్గ జిల్లాలోని బరంగ్‌నూర్ గ్రామానికి చెందిన హసన్‌షా(25) శనివారం బైక్‌పై జహీరాబాద్ పట్టణానికి వస్తున్నాడు. మొగుడంపల్లి వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. హసన్‌షా పరిస్థితి విషయంగా ఉండటంతో సంగారెడ్డికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లమ్మకు బోనాలు



బోనాలతో వస్తున్న మహిళలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లిలో రేణుక ఎల్లమ్మ తల్లికి గ్రామస్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. ఎల్లమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

వేసవి శిబిరాలు.. కలల సాకారాలు

- ఎమ్మెస్ క్రికెట్ అకాడమీలో శిక్షణ శిబిరాలు
- ప్రతిరోజు ఉదయం, సాయంత్రం తర్ఫీదు
- జిల్లా స్థాయిలో క్రికెట్‌లో రాణిస్తున్న అమ్మాయిలు, అబ్బాయిలు



ఎమ్మెస్ క్రికెట్ అకాడమీలో వేసవి శిక్షణలో విద్యార్థులు

సంగారెడ్డి క్రైమ్: విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులతో సందడిగా మారాయి. క్రికెట్‌ను మనదేశంలో పెద్దల నుంచి చిన్నపిల్లల వరకు ఎంతగా ఆరాధిస్తున్నారో చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం విద్యార్థులు ఒక మెట్టు ముందే ఉన్నారని చెప్పవచ్చు. చాలామంది విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే తమ అభిమాన క్రికెటర్‌లా ఎదగాలని కలలు కంటున్నారు. వాటిని సాకారం చేసుకునేందుకు వేసవి సెలవుల్లో జిల్లా హెడ్ క్వార్టర్స్‌లోని ఎమ్మెస్ క్రికెట్ అకాడమీలో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఎమ్మెస్ క్రికెట్ అకాడమీ ప్రాంగణంలో శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 6 నుంచి శిక్షణ శిబిరాలను ప్రారంభించిన అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని అందుబాటులో ఉంచారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు అకాడమీలో ప్రాక్టీస్ కొనసాగుతోంది. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల బాల,బాలికలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు.

విద్యార్థులకు క్రికెట్‌లో శిక్షణ

ఎమ్మెస్ క్రికెట్ అకాడమీలో ప్రధాన కోచ్ చంద్రమౌళి ఆధ్వర్యంలో విద్యార్థులకు తగిన మెలకువలు నేర్పిస్తున్నారు. క్రీడల్లో శిక్షణ పొందేందుకు విద్యార్థులు భారీగా బారులు తీరుతున్నారు. తెల్లవారు జామున విద్యార్థులు అకాడమీకి చేరుకుంటున్నారు. అకాడమీలో విద్యార్థులకు తగిన శిక్షణ ఇస్తున్నారు. అమ్మాయిలకు,అబ్బాయిలకు ఒకే విధంగా మెలకువలు నేర్పిస్తారు. శిక్షణ అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయిలో సెలెక్ట్ చేస్తారు.

జాతీయ స్థాయిలో ఆడటమే ఆశయం



ప్రస్తుతం అండర్ -14 విభాగంలో ఆల్‌రౌండర్ ప్రతిభతో జిల్లా స్థాయిలో రాణిస్తున్నా. విరాట్ కోహ్లీకి వీరాభిమానిని. శిక్షణ పొందుతూ ఆటలో మెలకువలు నేర్చుకుంటున్నా. జాతీయస్థాయిలో ఆడాలన్నదే నా ఆశయం.

– చందన, అండర్ 14

జట్టులో స్థానమే లక్ష్యం



డిగ్రీ చదువుతూ అండర్ 23లో రాణిస్తున్నా. అటు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆడి ప్రశంసలు అందుకున్నా. హెచ్‌సీఏ వేసవి శిబిరాలు పేద విద్యార్థులకు వరం లాంటివి. జాతీయ స్థాయి జట్టులో ఆడటమే నా లక్ష్యం.

– నవీన్, అండర్ 23

200 మంది విద్యార్థులకు శిక్షణ



ఎంతో పట్టుదలతో తమ ఇష్టమైన క్రీడారంగంలో రాణించాలని తపన పడుతున్నారు. జిల్లా నుంచి ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు అండర్ విభాగం -14, 16, 19 , 23లో ఉత్తమ ప్రతిభ చూపుతున్నారు. ప్రస్తుతం అకాడమిలో దాదాపు 150 నుంచి 200 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు.అమ్మాయిలు సైతం అండర్ విభాగం -14, 19లో రాణిస్తూ ఇతరులకు స్ఫూర్తిని నింపుతున్నారు. విద్యార్థులు జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో రాణించాలని కష్టపడుతున్నారు.

– చంద్రమౌళి, ప్రధాన కోచ్, ఎమ్మెస్ క్రికెట్ అకాడమీ

సమాజం అభివృద్ధికి కృషి చేయాలి: ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు తమ స్వప్రయోజనం కోసం కాకుండా సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గౌరీ నీలకంఠ ఆలయ 34వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో రాణించిన నీలకంఠ విద్యార్థుల అభినందన సభలో పాల్గొని పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య సమాజ బాధ్యతను పెంచుతుందని తెలిపారు. నీలకంఠ సమాజ సభ్యులందరూ ఐక్యంగా ఉండాలని, ఆలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. వార్షికోత్సవాలను సంతోషంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీలకంఠ సమాజ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు